నాకు ఏమి కావాలి, ఏది సుఖాన్నిస్తుందనే ప్రశ్నకన్నా, ఇతరుల వద్ద ఏమున్నాయో, వారికన్నా మనవద్ద అధికంగా గొప్పగా ఉండాలనే తపన కనిపిస్తూంటుంది, ఇక్కడ కొందరి మనస్తత్వాలలో. ఒకరికన్న ఒకరు మిన్నగా ఉండాలనీ, దానిని ఇతరులు గుర్తించాలనీ పోటీ మొదలవుతుంది. దీనికి అంతు లేదు. పార్టీలలో చేసే వంటకాలనుంచీ నివసించే సౌధాలవరకూ పాకుతుంది ఈ పోటీ, ఒక అంటు వ్యాధిలా. ఇక్కడ షాపులలో క్రొత్తవస్తువులు కనిపిస్తూనే ఉంటాయి నిత్యం. పైగా స్వదేశం వెళ్ళనవసరం లేకుండానే నగలు, చీరలు వగైరా దొరుకుతాయి స్వదేశపు దుకాణాలలో. ఇక చూసుకో మన ఆడవారిలో వాటిగురించి పోటీలు, ఆడంబరాలూ. పూర్వం కేవలం బంగారునగలు కలవారికి గుర్తింపు బాగానే ఉండేది. ఇప్పుడలా కాదు. నలుగురిలో రాణించాలంటే రవ్వలు, కెంపుల నెక్లసులు వగైరా ఉండాలి. ''మీరెప్పుడూ నగలు పెట్టుకోగా చూడలేదు. సింపుల్‌గా ఉంటారు'' అన్నారొక స్నేహితురాలు పార్టీలో. దాని గూఢార్థం 'మీకు విలువైన వస్తువులు లేవా' అని. ఎంతసేపూ ఎదుటి వారికి లేవనో, వారు తమకన్నా తక్కువ అంతస్తుగలవారనో మాట్లాడుకోవడం మినహా బహుశ ఆ ఎదుటి వ్యక్తికి నగలపట్ల కోరికలేదేమోనన్న ఆలోచన వారికెందుకు రాదోమరి. నా చిన్నతనంలో మా అమ్మగారనే మాటలు ఇప్పటికీ నా చెవులలో మారుమోగుతూంటాయి. తను ఎన్నడూ ఏ సందర్భంలోనూ పట్టుచీరలు కట్టేవారు కారు. ఎప్పుడూ గుంటూరు నేత చీరలే వాడేవారు - ఇంటా బయటా కూడా. పట్టు చీరలు కట్టుకోమని నేనడిగినపుడు 'అమ్మా! నాకు పట్టుచీరలు కట్టాలనే కోరిక లేదు. ఈ నేతచీరలే శరీరానికి సుఖంగా ఉంటాయి. ఇతరులు నాకు ధనం లేదని అందువలన ఇలా ఉన్నాననీ అనుకుంటే నాకు కలిగిన నష్టమేమిటి? నాకు అన్నీ ఉన్నాయి. అన్నిటి కన్నా మించి తృప్తిఉంది.''తృప్తించెందని మనుజుడు ...'' అంటూ సుమతీశతకంలోని పద్యం చెపుతూండేవారు. అటువంటి ఆడంబరపు పార్టీలకు వెళ్ళి ఇంటికి వచ్చిన తర్వాత నిద్రకూడ వచ్చేదికాదు ఆలోచనలతో.

జీవితానికి అర్థం, పరమార్థం తెలియడంలేదు. జీవితంలో దృక్పథం మారుతోంది. పూర్వం సంతోషం, సుఖాన్ని ఇచ్చే వస్తువులు, మనుష్యులు, సంఘటనలు నేడు ఆ అనుభూతి నివ్వడంలేదు. అవే వస్తువులు, అదే మనుష్యులు. వాటిలో మార్పులేదు. ఆ మార్పేదో నాలో వస్తోందనిపిస్తోంది. ఏదో చెప్పలేని వెలితి, తపన. బ్రతుకు తుది ఘడియలు సమీపించకమునుపే శరీరంలో శక్తి అంతరించకముందే నేను కోరేదేదో తెలుసుకోవాలనీ,దానిని అందుకోవాలనీ తీవ్రమైన వాంఛ చెలరేగుతోంది నాలో. అందుకే కొంతకాలం పీస్‌కోర్‌లో గడపాలనీ, మనదేశం తిరిగి చూడాలనీ కోరికతో బయలుదేరి వస్తున్నాను. నా మనసులో రగుల్కొనే ఈ అగ్ని పరాకాష్ఠ చేరక ముందే దానిని చల్లార్చి ఊరడించే ప్రయత్నమే ఈ నా నిర్ణయం. ఇది చదివి కలత చెందకు. అందరికీ జీవితంలో ఏదో ఒక మలుపులో కలిగే ఆలోచనలే ఇవి. వాటి ఆచరణలో మాత్రం తేడాలుండవచ్చు. ఆ ఆ వ్యక్తుల అభిరుచులు, చుట్టి ముట్టి ఉండే పరిస్థితుల ప్రభావాన్ని బట్టి. నేనెవరో, నాకేమి కావాలో తెలుసుకునే ప్రయత్నంలో ఇది ఒక చిన్న మెట్టు మాత్రమే. నా ప్రయత్నానికి దైవబలంకూడ కావాలి. అప్పుడే ముందడుగు.

ప్రేమతో
రాధ

ఉత్తరం పూర్తిగా చదివి నిట్టూర్చి సోఫాలో పడుకున్న మాధవి లోపలకు అడుగు పెడుతూనే మూవీకి వెడదాం లెమ్మంటూ మాట్లాడుతున్న తనభర్త క్రిష్ణకు ఉత్తరాన్ని అందించింది నిస్తేజంగా.

వంగూరి ఫౌండేషన్ వారి అమెరికా కథానికల నాల్గవ సంపుటం సౌజన్యంతో....రచయిత్రి అంగీకారంతో పునః ప్రచురణ...కి.ర.

---

ప్రక్క ఇంట్లో అరుపులూ కేకలకు బెంబేలెత్తిన పురుషోత్తం, ఆ యింట్లోకి వెళ్ళి అరుచుకుంటున్న వారిని ఉద్దేశించి అనునయంగా చెప్పాడు :

'ఇల్లు అనగానే ఇంటికైన యజమాని, ఇంటి పెద్ద అంటూ ఒకరు ఉండాలి. వారి మాటను యింట్లో వాళు గౌరవించి, ఆ ప్రకారం నడుచు కొంటేనే సుఖశాంతులు'

'మీ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాం. ఎటొచ్చీ, ఇక్కడ వారందరూ ఎవరు యజమాని ? - అనే విషయం మీదనే పోట్లాడుకుంటు న్నారు.' అన్నాడు వారి రెండో అబ్బాయి.

—యన్ శంకరశాస్త్రి
చిత్తూరు-1

---

పుస్తక సమీక్ష

## కించిత్ భోగే భవిష్యతి

రచయిత: **వేమూరి వెంకటేశ్వరరావు**, పేజీలు 136 , ధర $10 ,
ప్రతులకు: వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, పి.ఒ.బాక్సు 1948,స్టేఫర్డు టెక్సాసు 77497 లేదా భారతదేశంలో: వై.వి.యస్.ఆర్.యస్.సాయి, వాహిని బుక్ ట్రస్టు, 1-9-286/3, విద్యానగర్, హైదరాబాద్-500 044

ఇదేదో సంస్కృతభాషా పుస్తకమని, మనకెందుకులే అని వదిలివేయకండి. ఇవి సైన్సు ఫిక్షను కథలు. తెలుగులో ఇవి అరుదే. ఆమాటకొస్తే వైజ్ఞానిక సాంకేతిక విషయాలు తెలియచేసే వ్యాసాలు తెలుగులో శ్రీ వసంతరావు వెంకటరావు గారు వ్రాసేవరకూ లేవు. అసిమోవ్ ఆంగ్ల భాషలో, వేమూరి తెలుగులోను మెరుగులు దిద్దిన సైన్సు ఫిక్షన్ సాహిత్యాన్ని అందించారు.

విజ్ఞానవిషయాలను సామాన్య ప్రజలకు అందచేయాలన్నధ్యేయంతో కృషిచేసి, కథలను, వ్యాసాలను, పుస్తకాలను వ్రాసిన వేమూరి ఈ పది కథలను మనకు అందించారు. ఇందులోని పాత్రలు నిజజీవితంలో మనకు కనిపించే వ్యక్తులే. ప్రొఫెసరు మిడతంభొట్లు నోబెల్ బహుమానం సంపాదించిన తొలి తెలుగు వాడు అని ఒక పాత్రను పరిచయం చేస్తారు. వేమూరి వ్రాసిన సైన్సు ఫిక్షను ప్రభావం వల్లన ఓతెలుగువాడికి నోబెల్ బహుమానం వస్తే మనం అందరం సంతోషించ వలసిన విషయం. మైథాలజీతో సైన్సుని కలిపిన "కించిత్ భోగే భవిష్యతి" కథలో త్రిభువన సంచారి అయిన నారదుడు కనిపిస్తాడు. రష్యన్లు స్పూట్నిక్‌ను రోదసిలోనికి పంపక ముందే నారదుడు మూడు లోకాలలో ప్రయాణం చేసేడు. సైన్సు ఫిక్షను వ్రాతలు మన పురాతన గ్రంథాలలో ఉన్నాయంటారా? ఆర్జవజీవులలోని తాయారమ్మగారి కథ సైన్సు సూత్రాలను వివరించిన కథ. కమ్మటి పెరుగు తిన్నంత తృప్తి కలిగించే కథ పంటికింద పోక చెక్క. డిటెక్టివ్ సాహిత్యమా అని భ్రమపడే కథ దంతోదంతం కథ. మిగిలిన కథలు బిగిగా అల్లినవి, చదివి ఆనందించదగ్గవి.

వేమూరి గారి శైలి ప్రత్యేకం. వారు వాడిన భాష నూతనం. "విజ్ఞాన వేత్తలు విత్త వాంఛనీ విజ్ఞానకాంక్షని సమదృష్టితో చూడగలగాలి" అని "తెలుగువాడు వరిమొక్కలాంటివాడు, ట్రాన్స్‌ప్లేంటు చేస్తేకాని రాణించడు" అన్న వాక్యాలు మణిపూసలు. "మరొకపాఠం " అని రచయిత హెచ్చరించి సైన్సుపాఠం మొదలు పెడతారు. బుద్ధి మంతుడైన విద్యార్థివలె సైన్సుపాఠం చదువ వచ్చును, లేదా అల్లరి పిల్లవాడి వలే పాఠానికి ఎగనామం పెట్టవచ్చు. తినుభండారాలు, ప్రాణదంష్ట్రలు, ఊహానాలు, పెత్తెలుగు అన్నమాటలు పీచుతీయని కొబ్బరిబొండాలు. కంప్యూటరు పుణ్యమా అని సీసపుఅక్షరాలను కూర్పు చేయనక్కర లేకుండా తెలుగు టైపు సెట్టింగు చేయవచ్చునని వేమూరి నిరూపించారు గాని, ముద్రారాక్షసాల బెడదపోలేదు. 6వపేజీలో "ప్రతేకం" అన్నది అచ్చుతప్పు. తెలుగులోస్పెల్‌చెక్ కనిపెట్టేవరకు అచ్చు తప్పులనుండి తప్పించుకో లేమేమో! కొత్తరకపు అచ్చుతప్పు 73 పేజీలో ఉంది: రెండు లైన్లు రిపీట్ అయ్యాయి.

వేమూరివారి కించిత్ భోగే భవిష్యతి అనే కథల పుస్తకాన్ని కాలక్షేపం కోసం, లేదా విజ్ఞానసముపార్జన కోసం పఠనం చేయవచ్చు. అమెరికా తెలుగుల గేహాలలో ఇది ఒక దండివెలుగు. -**రవరసాన సత్యనారాయణ**